అడల్ట్స్ ఓన్లీ కథ

# వసంత రాత్రి

శివపార్వతి

"తెలిసి తెలిసి నిన్ను చేసుకున్నాను చూడు... నాది బుద్ధిపొరపాటు.." రెండు చేతుల్తో చెంపల్ని కాస్త గట్టిగానే వాయించుకున్నాడు రాజేష్.

"ఎవరు చేసుకోమన్నారు. మీ యిష్టం వచ్చిందాన్నే కట్టుకోపోయారా. అయినా ఇప్పుడేం కొంపలంటుకుపోయాయని నన్నంతగా ఆడిపోసుకుంటారు" నొచ్చుకుంటూ అన్నది లిఖిత.

"ఆహా! ఎంత తేలిగ్గా తీసిపడేస్తున్నావ్....ఒక్కసారి జనంలోకెళ్లి చూడు..పెళ్లై నాలుగేళ్లయినా యింకా పిల్లా పీచు లేరంటూ ఒకటే గగ్గోల.."

"దానికి నన్నంటే ఏం వస్తుంది?"

"అవున్లే నిన్నని ఏం లాభం..." గొణుగుతూ ఆరోజు కంపెనీ నుండి తెచ్చిన శాలరీలోనుంచి కొన్ని పచ్చనోట్లు తీసి లిఖిత చేతిలో పెట్టాడు.

"దేనికివి?" అడిగింది.

"గాంధీ బొమ్మ దగ్గర గైనకాలజిస్ట్ వుందన్నావుగా..వెళ్లి చూపించుకో.." చెప్పాడు.

"ఈ పని ఎప్పుడో చేసుండాల్సింది..."

"ఆ...మనింట్లో డబ్బులు చెట్లకి కాస్తున్నాయని..."


"మరి పెళ్లెలా చేసుకున్నారు?" అందామనుకున్నది గాని మళ్లీ అతడ్ని రెచ్చగొట్టినట్టవుతుందని అంతటితో ఆగిపోయింది లిఖిత.

రాజేష్ పైకి అలా వుంటాడేగాని, మొదట్నుండి కొన్ని విలక్షణ భావాలున్న మనిషి. తోటివాళ్లంతా కట్నాలు కోరుకుని ఆస్తుల్ని పెంచుకోవటం అతనికి తెలుసు. తనకి తల్లిదండ్రుల్నుండి పెద్దగా ఆస్తిపాస్తులు సంక్రమించకపోయినప్పటికి పెళ్లి విషయంలో కట్నాలు కాదని ముక్కు మొహం కళగా వుండే పిల్ల తోడయితే చాలనుకున్నాడు. తన భావాలకి తగ్గట్టుగానే లిఖిత తోడయింది. అయితే ఆర్థికపరమైన ఎదుగుదల విషయంలోనే అతనికి వెలితి ఏర్పడిపోయింది. తోటివాళ్లు కార్లల్లో తిరుగుతుండటం తనలో ఇన్ఫీరియారిటీని పెంచింది. దాంతో స్వల్ప విషయాలు కూడా పెద్దవిగా కనబడ్డం...మెదడుని మెలిపెట్టే ఆలోచన్లు..టెన్షన్..చీటికిమాటికి భార్యమీద చిరుబుర్రులు... పెళ్లయిన కొత్తలో ప్రేమగా చూసే భర్తలో లిఖిత రాను రాను మార్పుల్ని చూస్తూనే వుంది. అయినా మరింత లోతుగా కలుగజేసుకో లేకపోవటానికి కారణం, కనీసం ఆడపిల్ల కట్నంగా ఫర్నిచరయినా కొనివ్వలేనంత పేదింటినుండి రావటం. దానికితోడు పిల్లలు లేరన్న సమస్య ఫైనాన్స్‌తో ముడిపడి వుండడం.

ఇన్నాళ్లకైనా రాజేష్ ఈ విషయంపైన దృష్టిపెట్టడం లిఖితకి కొంత రిలీఫిచ్చినట్టయింది. అయితే ఒక్క విషయంలో మాత్రం అతను బొత్తిగా మూర్ఖం. పిల్లలు కలగలేదంటే దానికి నూటికి నూరుశాతం తన వైపు లోపమేనంటాడు. దానిపైన అతన్తో వాదనలకి దిగేకన్నా ముందు తనవైపు నుంచి సమస్య క్లారిఫై చేసుకోవటమే ఉత్తమం అనుకుంది లిఖిత.

☆ ☆ ☆

మర్నాడు రాజేష్ని డ్యూటీకి వెళ్లనిచ్చి లిఖిత దగ్గర్లో వున్న గాంధీబొమ్మ దగ్గరకి వెళ్లింది. ఆ కాలనీకి పేరు పొందిన గైనకా



లజిస్ట్ డాక్టర్ గాయత్రిని కలిసింది.

ప్రాథమిక చెకప్ అయిన వెంటనే ఆమె రాసిచ్చిన తేదీల ప్రకారం తిరిగెళ్లి కలిసింది. మరోవైపు రాజేష్ కూడా ఆమె రిపోర్ట్‌ల కోసం ఎదురుచూస్తున్నాడు.

అన్ని టెస్ట్‌లు పూర్తయ్యాక లిఖితలో ఏ లోపం లేదని తేలింది. దాంతో రాజేష్ ఆలోచనలో పడ్డాడు. మామూలుగా స్వల్ప విషయాలకై కంగారుపడే అతను ఆ విషయంలో మరింత కంగారుపడ్డాడు. ఈసారి భర్తతో పాటు రమ్మని డాక్టర్ సూచించటంతో రాజేష్‌కి వెళ్లక తప్పలేదు. సంబంధిత టెస్ట్ చేయించి రాజేష్‌ని కూర్చోబెట్టి కౌన్సిలింగ్ జరిపింది డాక్టర్. తర్వాత లిఖిత నొక్కదాన్ని లోపలికి పిలిచి లోపం అతన్లోనే వున్నట్టు చెప్పింది.

ల్యాబ్‌లో రిపోర్ట్ తీసుకుంటున్నప్పుడే చూచాయగా అర్థమైంది రాజేష్‌కి. లోపం లిఖితలోనే వున్నట్టు ఇప్పటి వరకు వేలుపెట్టి చూపాడు. తీరా ఇప్పుడు ఆమె ముందు తలెత్తుకుని నిలబడటం అతనికి నామోషి అయ్యింది.

☆ ☆ ☆

ఆ రాత్రంతా భార్యాభర్తల మధ్య మాటల్లేవు. మర్నాడు కంపెనీలో ఓ.టి.వున్నా కాదనుకుని ఇంటికొచ్చాడు రాజేష్.

తీరా తలుపులకి తాళం వేసుండటం చూసి నిర్ఘాంతపోయాడు. పెళ్లైన ఇన్ని సంవత్సరాల్లో ఇలా ఎప్పుడూ జరగలేదు. లిఖిత తనమీద అలిగి పుట్టింటికి వెళ్లిందా?

తను రావడం మేడమీద నుంచి చూసినట్టుంది ఇంటి ఓనర్. తాళం చెవితో వచ్చి అదే విషయాన్ని చెప్పటంతో మరికొంత షాక్‌కి గురయ్యాడు.

"మీ ఆవిడ ముఖంలో ఏదో మార్పు కనిపించింది. ఇద్దరూ గొడవగాని పడ్డారా ఏం?" ఆరా తీయబోయింది.

"లేదండీ తను మీకు తాళం ఇచ్చి వెళ్తున్నట్టు ఉదయమే చెప్పింది" కవర్ చేశాడు పరువుపోకుండా.

వీలైనంత త్వరగా లిఖితని కలవాలి. పిల్లలు కలగకపోవటానికి ఇన్నాళ్లుగా తననే అనుమానించినందుకు మొదట క్షమాపణ అడగాలి. ఎంత డబ్బు ఖర్చయినా సరే తన లోపాన్ని సవరించేసుకుని ఆమెకు బిడ్డలు కలిగేలా సహకరిస్తానని నమ్మకంగా తెలియచెయ్యాలి.

ఫోన్లో కొలీగ్‌కి సెలవు సంగతి చెప్పి తక్షణమే తన సూట్‌కేస్ సర్దుకున్నాడు.

☆ ☆ ☆

మామగారింట్లో తనకి మగతనం లోపించిన వాడిగా చిన్నచూపు చూస్తారేమోనని అభిప్రాయపడ్డాడు రాజేష్. కానీ అటువంటి దాఖలాలేవీ అక్కడ కనిపించలేదు. పైగా అల్లుడు యింతకాలం తర్వాతయినా తమింట్లో వుండటానికి రావటం ఒక వరంగా భావించారు ఆ యింట్లో. కొత్తపెళ్లికొడుకు సేవలు మళ్లీ అందుకున్నాడు. లిఖిత ఆ రాత్రి మిద్దెపైన ఇద్దరికీ పక్క పరిచింది. పున్నమి చంద్రుడు అంతకంటే ముందే తన చల్లదనాన్ని వెన్నెల పక్కని పరిచి వుంచాడు. దూరాన గాలికి రెప రెప లాడుతున్న కొబ్బరిచెట్లు...తనువు పులకించేలా వుండుండి వింజామరలు వీస్తున్న చల్లని గాలి..రాజేష్‌కి ఆ వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

వెలితల్లా ఒక్కటే, లిఖిత తనతో అంటీ అంటనట్టుగా వుండటం.

"లిఖీ! నన్ను క్షమించు. నా పొరపాటు ఒప్పుకుంటున్నాను..." మృదువుగా ఆమె భుజంపైన చెయ్యి వేస్తూ అన్నాడు.

లిఖిత అతని చేతిని సున్నితంగా తొలగించింది. అక్కడ అమృతసిరులు పండిస్తున్న చల్లనిగాలి, వెన్నెల..జతకాడు..ఏవీ తనవి కావన్నట్టు పక్కపైన మూడంకె వేసింది.

రాజేష్‌కి క్షణాలు భారంగా గడుస్తున్నాయి. లిఖిత తొందరగా అలగదు. ఒకవేళ అలిగిందంటే ఆమెను దారిలోకి తెచ్చుకోవటానికి ఒక్క రాత్రి చాలదు.

ఆకాశంలో చుక్కలు లెక్కేస్తూ ఇటువైపు తిరిగిన రాజేష్‌కి లిఖిత నడుం ఒంపులో వెన్నెలకాక చందమామే తళుక్కున మెరిసింది. క్షణం మెరిసే మెరుపునకు కెమెరా ముందు నిలబడ్డ వ్యక్తి ఆకారం యావత్తు ఫిల్మ్ మీద అతికిన చందంగా ఒక్కసారి అతనిలోని నరాలు ఉత్తేజం పొందాయి.

రాత్రిపూట పడుకోటం ఒక్క గంట లేటయితే పగలు నిద్రమత్తు తనేపని చేసుకోనివ్వటం లేదంటూ కంప్లయింట్ చేసే రాజేష్‌కి ఆ రాత్రి శివరాత్రే అయింది. జాగరణకి తను సిద్ధం. కాని, లిఖిత సహకరిస్తుందో లేదోనన్న సందేహం. గోడ మనదే అయినప్పుడు గూట్లో రాయేస్తే తప్పేముంది అనుకున్నాడు. నెమ్మదిగా ఆమె నడుంపైన చెయ్యి వేశాడు. లిఖిత నుండి ఎటువంటి స్పందనా లేదు. జాకెట్ పైభాగంలో మెడవంపు దగ్గర రెండు పెదవులు ఆన్చాడు. అప్పుడు...శృంగారపురంలోకి అడుగుపెడుతున్న మన్మథుడికి పూలదండతో ఆహ్వానం పలుకుతున్నట్టుగా ఆమె చెయ్యి అతని వేతిమీదకి పాకింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ గ్రీన్‌సిగ్నల్ అందాక ఒక్కసారిగా పుంజుకున్న ఇంజన్‌లా ఆమెని తనివితీరా తన బాహువుల్లో బిగించాడు రాజేష్. ఆ ఒక్కరోజే కాదు వారం రోజులపాటు వారికి పగటి నిద్రే.

☆ ☆ ☆

"అయితే యిన్నాళ్లకి నీ అలక తీరిందంటావ్.." లిఖిత చెవిలో గుసగుసగా అన్నాడు రాజేష్.

లిఖిత పెదవులపైన విజయంతో కూడిన చిరునవ్వొకటి మెరిసింది.

లిఖిత తల్లి తమకోసం ప్రత్యేకంగా వండి పెట్టిన తినుబండారాలు అవీ సర్దేసుకుని తాముండే చోటికి తిరిగొచ్చేశారు.


మర్నాటి నుండి రాజేష్ డ్యూటీ బిజీలో పడిపోయాడు.

కాలం గడుస్తోంది.

రాజేష్ పిల్లలు కలగటానికి తగిన ట్రీట్‌మెంట్ కోసం డబ్బు కూడబెట్టుకుంటుండగా లిఖిత వాంతులు చేసుకుంది. అనుమానంతో హాస్పిటల్‌కి తీసుకెళ్లిన అతనికి ఆమె గర్భవతి అని తేలింది.

రాజేష్ తలబద్దలు కొట్టుకునే పనిలేకుండానే అతన్ని కూర్చోబెట్టి అసలు గుట్టు విప్పింది లిఖిత.

"మగవాళ్లల్లో వంధ్యత్వానికి ప్రాథమికంగా రెండే కారణాలు. ఒకటి పోషకాహార లోపం, రెండోది మానసిక వత్తిడి. తోటివాళ్ల స్థాయికి ఎదగలేదని అనుక్షణం ఒత్తిడిపడ్డం... జరగాల్సిన కార్యక్రమాన్ని అసంపూర్ణంగా మిగిల్చెయ్యడం...ఇలా జరుగుతూపోతే విడుదల కావాల్సిన మోతాదుకు తగినంత హార్మోన్ల ఉత్పత్తికి ఆటంకం కలగక మానుతుందా...అందుకే డాక్టర్ సలహామేరకు మిమ్మల్ని ఆసాంతం నా వైపునకు తిప్పుకున్నాను. మన పెళ్లయ్యాక డ్యూటీ అంటూ ఒక్కరోజు కూడా ప్రశాంతంగా గడపని మిమ్మల్ని పుట్టింటి అలకతో కొత్త వాతావరణం చూపించాను. తాత్కాలికంగానైనా మీ మనసు దిగుళ్ల నుంచి బయటపడటం మీకే ఉపకరించింది..." చెప్పింది.




పోటీ యుగంలో ఒత్తిళ్లు తన ఒక్కడ్నే వెతుక్కుంటూ రాలేదు. వాటిని గోటితో తొలిచెయ్యగల సమర్థత లేకుంటే కలిగే అనర్థాలు తనలాంటి చాలామంది ఎదుర్కోవాల్సిందే. ఏదేమైనా ఈ విషయంలో డాక్టర్ చెప్పింది సరిగ్గా అర్థం చేసుకుని తనని దుర్భరత నుండి బైటపడేసిన తన భాగస్వామికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నాడు రాజేష్. ఆరోజు నుండి ఆ దంపతులకి ప్రతి రాత్రి మనసులు కలిసిన వసంత రాత్రే అయింది.

☆